క్లుప్తంగా

నేడు మంత్రి హరీశ్‌రావు రాక

పటాన్‌చెరు: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు శనివారం పటాన్‌చెరులో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీబంధు పథకం ద్వారా ఎంపికైన మొదటి విడత లబ్ధిదారులకు చెక్కులను జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో పంపిణీ చేస్తారన్నారు. అనంతరం నియోజకవర్గానికి నూతనంగా మంజూరైన 108, 102 అంబులెన్స్ వాహనాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని సూచించారు.

నీలం మధుకు సన్మానం


పీర్ల జాతరలో నీలం మధు ముదిరాజ్

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలో గురువారం రాత్రి నిర్వహించిన అలీ అబ్బాస్ జాతరకు బీఆర్ఎస్ రాష్ట్ర నేత నీలం మధు ముదిరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పీర్లను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం జాతర నిర్వాహకులు నీలం మధును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ కంజర్ల శ్రీనివాస్, ఉపసర్పంచ్ తలారి దయానంద్, మాజీ సర్పంచ్ నర్సింహులు, లక్ష్మణ్, రాజు, విష్ణు, శ్రీనివాస్, ప్రకాశ్, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుగా బాధ్యతల స్వీకరణ


శ్రీనివాస్‌రావు

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లి మండల నూతన తహసీల్దారుగా శ్రీనివాస్‌రావు శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. వనపర్తి తహసీల్దారుగా పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు వట్‌పల్లి డిప్యూటీ తహసీల్దారు శంభిరెడ్డి ఇన్‌చార్జి తహసీల్దారుగా కొనసాగారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్


జిన్నారం(పటాన్‌చెరు): విద్యతో ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని జడ్పీటీసీ కుమార్‌గౌడ్ అన్నారు. వీర్కో ల్యాబ్స్ సౌజన్యంతో గుమ్మడిదల ఉన్నత పాఠశాల విద్యార్థులకు బూట్లు, టై, సాక్స్, బెల్ట్‌లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, హెచ్ఎం అరుణజ్యోతి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి చోరీ


ధ్వంసమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

అల్లాదుర్గం(మెదక్): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులోని సామగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన గురువారం రాత్రి అల్లాదుర్గం శివారులో చోటుచేసుకుంది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం చిల్వెర ఐబీ చౌరస్తా నుంచి వట్‌పల్లి వెళ్లే రహదారి పక్కన వ్యవసాయ బోర్లకు సరఫరా అయ్యే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను రైతులు ఏర్పాటు చేసుకున్నారు. గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి అయిల్, ఇతర విలువైన సామగ్రిని చోరీ చేశారు. సామాగ్రి విలువ రూ.60వేలకు పైగా ఉంటుందని రైతులు వాపోయారు.

డాకూరులో పశు వైద్యశిబిరం


పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నరేందర్‌రెడ్డి

వట్‌పల్లి(అందోల్): మండలంలోని డాకూరులో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరంలో డాకూరు, నాదులాపూర్ కొడెకల్‌లకు చెందిన 140 జీవాలకు పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని అక్సాన్‌పల్లి సొసైటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

చినిగెపల్లి గ్రామంలో..

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని చినిగెపల్లి గ్రామంలో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ఎంఏ ఘనీ పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వీధికుక్కల వీరవిహారం

- భయాందోళనకు గురవుతున్న ప్రజలు
- వాహనదారులను వెంబడిస్తున్న శునకాలు
- వీధికుక్కల సంచారాన్ని అరికట్టాలని స్థానిక ప్రజల విన్నపం


జిన్నారంలో గుంపులుగా సంచరిస్తున్న వీధికుక్కలు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని జంగంపేట, జిన్నారం, గడ్డపోతారం, సోలక్‌పల్లితో పాటు బొల్లారం మున్సిపల్ పరిధిలో వీధి కుక్కలు వీరవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. బైక్‌పై వెళ్తున్నవారిని సైతం వెంబడిస్తుండటంతో కిందపడి ప్రమాదాల బారిన పడుతున్నారు.

బొల్లారం మున్సిపల్ పరిధిలో కాలనీలలో వీధికుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. దీంతో అటుగా వెళ్తున్న ప్రజలపై దాడులు చేస్తున్నాయి. వీధికుక్కల బెడదను అరికట్టాలను పలుమార్లు మున్సిపాలిటీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. కుక్కకాటుకు గురై ఎంతోమంది ఆస్పత్రుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి వీధికుక్కల నుంచి రక్షించేవిధంగా చర్యలు తీసుకోవాలని కాలనీలవాసులు కోరుతున్నారు.

ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్న

వారం రోజుల క్రితం పని నిమిత్తం బయటకు వెళ్తున్న క్రమంలో వీధికుక్క కాటుకు గురయ్యాను దీంతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ వైద్యం తీసుకుంటున్న.. మున్సిపాలిటీ అధికారులు స్పందించి వీధికుక్కలను సంచారాన్ని అరికట్టేవిధంగా చర్యలు తీసుకోవాలి.
– రాజు, బాలాజీనగర్, బొల్లారం

అప్రమత్తంగా ఉండాలి

వీధికుక్కలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఆస్పత్రిలో కుక్క కాటుకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఏడాదిగా పీహెచ్‌సీ పరిధిలో పదుల సంఖ్యలో కుక్క కాటు కేసులు వచ్చాయి. కుక్క కాటుకు గురైన వెంటనే తగిన చికిత్స తీసుకోవాలి.
– రాధిక, ఆస్పత్రి వైద్యురాలు, బొల్లారం

అర్హులకు దళితబంధు ఇవ్వాలి


నిరసన తెలుపుతున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండలంలోని ఇస్నాపూర్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇస్నాపూర్ చౌరస్తాలో బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ అధికార పార్టీ అనుచరులకే దళితబంధు కేటాయించడం సరికాదన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమతుందని తెలిపారు. కార్యక్రమంలో ఇస్నాపూర్ సర్పంచ్ గడ్డం బాలమణి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుధారాణి, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, పటాన్‌చెరు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

చెరకు రైతుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జహీరాబాద్: జహీరాబాద్‌లోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారం యాజమాన్యం రైతులకు బకాయి పడిన బిల్లులను చెల్లించాలని కోరుతూ రైతు సంఘం నాయకుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఢిల్లీ వసంత్, మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో కేన్ కమిషనర్ బద్రు మాలోతును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరకు రైతులకు బకాయిలు ఇచ్చే విషయంలో యాజమాన్యం జాప్యం వహిస్తోందని, కర్మాగారంలో వెంటనే క్రషింగ్ నిర్వహించేవిధంగా చర్యలు చేపట్టాలని విన్నవించారు. చెరకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు కార్యాచరణ చేపట్టారని పేర్కొన్నారు.

ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలి


ఎమ్మెల్యే మాణిక్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్ఎంలు

జహీరాబాద్ టౌన్: ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలని కోరుతూ కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు శుక్రవారం ఎమ్మెల్యే మాణిక్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ గ్రాస్ జీతంతో ఎంపికైన తమకు 21 ఏళ్ల నుంచి ఫిక్స్‌డ్ బేసిక్ జీతం మాత్రమే చెల్లిస్తున్నారని వాపోయారు. తమతో పాటు విధులోకి చేరిన కొంతమందిని రెగ్యులర్ చేశారని, మిగతా వారిని ఇంకా రెగ్యులర్ చేయలేదన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు.

'డేటా ఇంజనీరింగ్'పై సదస్సు

పటాన్‌చెరు టౌన్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మరో అంతర్జాతీయ సదస్సు నిర్వహణకు సమాయత్తమవుతోంది. డేటా ఇంజనీరింగ్ అండ్ మెషిన్ ఇంటెలిజెన్ అంశంపై నవంబర్ 22 నుంచి 24వ తేదీ వరకు అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నట్టు గీతం విద్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. డేటా సైన్స్, డేటా ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్ బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, సుస్థిరత విజ్ఞాన ఆధారిత నిపుణుల వ్యవస్థలపై ఆలోచనలు, కొత్త పరిశోధనల్లోని అంతర్గత అంశాలను పంచుకోవడానికి విశ్వవ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తలు, విద్యావేత్తలకు ఒక అంతర్జాతీయ వేదికను అందించడం ఈ సదస్సు లక్ష్యమని పేర్కొంది. పరిశోధన పత్రాలను సెప్టెంబర్ 10వ తేదీలోగా సమర్పించాలని, తదనంతరం వాటి ఆమోదంపై సెప్టెంబర్ 30లోగా తెలియజేస్తామని తెలిపింది. ఆసక్తి ఉన్నవారు అక్టోబర్ 15వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొంది. ఇతర వివరాలకు 9620160306, గీతంకు ఈ–మెయిల్ చేయాలని సూచించింది.

హోంగార్డ్ వెంకటయ్యకు అభినందన

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఇటీవల వివిధ జిల్లాలకు చెందిన పోలీసు బ్యాండ్ సిబ్బందికి తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన బ్యాండ్ శిక్షణలో సంగారెడ్డి జిల్లా పోలీసుశాఖ తరుపున వెంకటయ్య, కృష్ణ హోంగార్డ్‌లు పాల్గొన్నారు. ఫైనల్ పరీక్షలో సంగారెడ్డి జిల్లా పోలీసు బ్యాండ్‌లో పనిచేస్తున్న వెంకటయ్య ట్రంపెట్ వాయించడంలో ప్రతిభను కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా ఎస్పీ రమణకుమార్ వెంకటయ్యను అభినందించారు.

డ్రైవింగ్ లైసెన్సు, హెల్మెట్ తప్పనిసరి

ఝరాసంగం(జహీరాబాద్): వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు, హెల్మెట్ కలిగి ఉండాలని ఎస్ఐ–2 క్రిష్టయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కృష్ణాపూర్ గ్రామ శివారులో వాహనాల తనిఖీ నిర్వహించారు.

బాలలను నేరస్తులుగా చూపరాదు



మాట్లాడుతున్న హనుమంతరావు

సంగారెడ్డి టౌన్: నేరం మోపబడిన బాలలను నేరస్తులుగా చూపరాదని వారి హక్కులను భంగం కలిగించకూడదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. శుక్రవారం సంగారెడ్డిలోని బాల రక్షణ భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ బాలలతో సరైన పద్ధతితో మెలగాలని, వారికి న్యాయంపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో జోనల్ కోర్టు జడ్జి శాలిని, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజాగాయకుడు గద్దర్‌కు నివాళి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ప్రజాగాయకుడు గద్దర్‌కు వివిధ పార్టీల నాయకులు శుక్రవారం తెల్లాపూర్‌లో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర నాయకులు బాలయ్య, కౌన్సిలర్ కొల్లూరి భరత్, తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెల్లాపూర్ గ్రామంలో గద్దర్ పేరిట ప్రభుత్వం ఐదెకరాల భూమిని కేటాయించి ఎగ్జిబిషన్, స్మృతివనం ఏర్పాటు చేయాలని కోరారు.

వీఆర్ఏలకు పదోన్నతులు

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని వీఆర్ఏలకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీఆర్ఏలకు ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో సర్దుబాటు చేస్తూ పదోన్నతులు కల్పిస్తూ నియామకపత్రాలను శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అధికారులు అందజేశారు. జిల్లాలోని 616 మంది వీఆర్ఏలను మున్సిపల్, మిషన్ భగీరథ, ఇరిగేషన్‌తో పాటు వివిధ శాఖలకు సర్దుబాటు చేశారు.

మొక్కలను సంరక్షించాలి

జిన్నారం(పటాన్‌చెరు): హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. శుక్రవారం బొల్లారం మున్సిపాలిటీలోని వైఎస్సార్ కాలనీలో సీఐ నయిమొద్దీన్‌తో కలిసి ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది, మెప్మా ఆర్పీలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన

మనూరు(నారాయణఖేడ్): మండల పరిధిలోని తుమ్నూరు, ముగ్దుంపూర్ గ్రామాల రైతులకు ఎస్‌బీఐ, భవిశ్య భారత్ సంస్థల నిర్వాహకులు శుక్రవారం పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ కృషి విజ్ఞానకేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త రమేశ్ రైతులకు సూచనలు సలహాలు, సాగు విధానంలో వాడాల్సిన ఎరువులు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ సాయికిరణ్‌రెడ్డి, భవిష్య భారత్ సిబ్బంది బిజ్జా వెంకటేశ్వర్లు, అజయ్ పాల్గొన్నారు.

బీపీఎంలపై చర్యలు తీసుకోవాలి

- ఆసరా పింఛన్లలో కోత విధించడం సరికాదు
- వికలాంగుల హక్కుల జాతీయ వేదిక కన్వీనర్ అడివయ్య


నిరసన తెలుపుతున్న వికలాంగ సంఘం నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): ఆసరా పింఛన్‌లలో రూ.16 కోత విధిస్తున్న బీపీఎంలపై చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక కన్వీనర్ అడివయ్య డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లాలో పోస్టు ఆఫీస్ ద్వారా పింఛన్లు పంపిణీ చేస్తున్న బీపీఎంలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ సంగారెడ్డిలోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ జిల్లాలో అనేక గ్రామాల్లో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఆసరా పెన్షన్ లబిదారులు పోస్టు ఆఫీస్‌ల ద్వారా పింఛన్లు తీసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం 2019 జూలై నుంచి వికలాంగులకు రూ.3016 ఇతర పింఛన్ లబ్ధిదారులకు రూ. 2016 అందజేస్తోందన్నారు. కానీ.. సంగారెడ్డి జిల్లాలో అనేక గ్రామాల్లో బ్రాంచ్ పోస్టుమాస్టర్ రూ.16 ఇవ్వడం లేదన్నారు. దీంతో స్పందించిన పోస్టల్ అధికారులు సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేస్తామని హామీనిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మాణిక్యం జిల్లా అధ్యక్షుడు గోపాల్ జిల్లా కార్యదర్శి బసవరాజ్ జిల్లా ఉపాధ్యక్షుడు మన్నె పోచయ్య, జయలక్ష్మి, నాగయ్య, నర్సింహులు జిల్లా నాయకులు రామచందర్, కిష్టయ్య, అంజప్ప, సత్యనారాయణ, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

జిన్నారం(పటాన్‌చెరు): ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి, సీఐ నయిమొద్దీన్ అన్నారు. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఐడీఏ కాలనీలో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు శుక్రవారం కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐడీఏ చౌరస్తా నుంచి బ్యాంకు వరకు నూతనంగా రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న కారణంగా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ శ్రీకాంత్, నాయకులు బషీర్, రాము, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

◆ డిప్యూటీ తహసీల్దార్ బదిలీ

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ తహసీల్దార్ మునిరొద్దీన్ వికారాబాద్‌కు పదోన్నదిపై బదిలీ అయ్యారు. ఇటీవల న్యాల్‌కల్‌కు బదిలీపై డిప్యూటీ తహసీల్దార్‌గా వచ్చిన మునిరొద్దీన్ తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఆయనను పదోన్నతిపై వికారాబాద్‌కు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా ఆయన స్థానంలో ఎవరు వస్తారన్నది ఇంకా నిర్ధారణ కాలేదు.

◆ పీజీటీ పోస్టు దరఖాస్తుకు ఆహ్వానం

మునిపల్లి(అందోల్): తాత్కాలిక పీజీటీ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని మునిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మోడల్ స్కూల్‌లో పీజీటీ పోస్టు ఖాళీగా ఉందన్నారు. జ్వాలోజీ పోస్టు గ్రాడ్యూయేట్ బీపీఈడీ ఉండాలని తెలిపారు. అసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 16వ తేదీలోపు మునిపల్లి మోడల్ స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

◆ చట్టాలపై అవగాహన అవసరం

సంగారెడ్డి టౌన్: న్యాయశాస్త్రంలోని చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హైకోర్టు న్యాయవాది కిరణ్ పాలకుర్తి అన్నారు. శుక్రవారం సంగారెడ్డిలోని కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు స్టడీ సర్కిల్, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ శాస్త్రంలోని ప్రధాన చట్టాలను, అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

◆ వైద్యశిబిరం ఏర్పాటు



మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండల కేంద్రంలో విగ్రం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ట్రస్ట్ చైర్మన్, ఫుడ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ విగ్రం శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలు, తండాల నుంచి వచ్చిన పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అంబేడ్కర్, పులే సేవా సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు భీంసేన,యువకులు పాల్గొన్నారు.

◆ జాతీయ జెండాలను ఎగురవేయాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆజాద్ కా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటితో పాటు ప్రభుత్వ కార్యాలయాలపై జాతీయ జెండాలను ఎగురవేయాలని రామచంద్రాపురం పోస్టల్ సబ్‌డివిజన్ అధికారిని సావిత్రి అన్నారు. శుక్రవారం బీహెచ్ఈఎల్ హర్ ఘర్ తిరంగ జెండా కార్యక్రమంలో భాగంగా పోస్టల్ ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ జెండాను పోస్టల్ ఆఫీసులో 25 రూపాయలకే విక్రయిస్తున్నట్టు తెలిపారు. పోస్టు ఆఫీస్‌కు రాలేనివారు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే ఇంటి వద్దకే డెలివరీ చేస్తామన్నారు.

◆ ద్రోహం షార్ట్ ఫిలిం విడుదల

వట్‌పల్లి(అందోల్): నందు క్రియేషన్స్ పతాకంపై మండలంలోని తాలెల్మకు చెందిన బోయిని నందకుమార్ నటించి దర్శకత్వం వహించిన ద్రోహం షార్ట్ ఫిల్మ్‌ను శుక్రవారం జోగిపేట సీఐ నాగరాజు విడుదల చేశారు. ఈ చిత్రంలో నటీనటులుగా పల్లె వెంకటరమణ, ముప్పారం పద్మారావు, ఆంజనేయులుయాదవ్, పోగుల జగన్‌గౌడ్, ఎండీ ఖలీల్, మన్నె యాదయ్య నటించారు.

◆ కరపత్రం ఆవిష్కరణ

నారాయణఖేడ్: ఈ నెల 16, 17వ తేదీల్లో పీకేఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సహకారంతో జుజాల్‌పూర్‌లోని హెచ్ఆర్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న వ్యక్తిత్వ వికాస శిక్షణకు సంబంధించిన కరపత్రాలను టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఖేడ్ లయన్స్ క్లబ్ చార్టెడ్ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఖేడ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భోజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శోభ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు


ఆటల పోటీలను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మునిపల్లి(అందోల్): ఆగస్టు 15 స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని ఖమ్మంపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం రన్నింగ్, స్కిప్పింగ్, చెంచాగోటి, మ్యూజికల్ చైర్ తదితర ఆటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖమ్రోద్దీన్, విద్యా కమిటీ చైర్మన్ నర్సింహులు, ఉపాధ్యాయులు వినయ్‌కుమార్, గోపాల్, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చిన్నారులకు చిన్ననాటి నుంచి దేశభక్తిని పెంపొందించేలా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని శ్రీదత్త విజయానందతీర్థ స్వామిజీ అన్నారు. శుక్రవారం భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీ కార్యసిద్ధి పంచముఖి ఆంజనేయస్వామి ఆలయల ప్రాంగణంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు చెస్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యువజన దినోత్సవం


మాట్లాడుతున్న ప్రొఫెసర్ చంద్రశేఖరయ్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అంతర్జాతీయ యువజన దినోత్సవ సందర్భంగా బీహెచ్ఈఎల్ కాలనీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణ, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జేఎన్టీయూ ప్రొఫెసర్ చంద్రశేఖరయ్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా సన్మార్గంలో నడవాలని సూచించారు. యువతపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖిత్ అంజుమ్, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.